క్లుప్తంగా

నగరంలోనూ ఉపాధి హామీ అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న దామా

ఒంగోలు టౌన్: నగరంలోనూ ఉపాధి హామీ పథకాన్ని అమలు చేయాల్సిన అవసరం ఉందని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు జీవీ కొండారెడ్డి అన్నారు. సీపీఎం నగర కమిటీ సమావేశాన్ని దామా శ్రీనివాసులు అధ్యక్షతన శనివారం నిర్వహించారు. కొండారెడ్డి మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్లో ఉపాధి హామీ పథకానికి నిధులు విడుదల చేయకపోవడం అన్యాయమన్నారు. నగరంలో చిన్న పరిశ్రమలు ఏర్పాటు చేసి ఉపాధి కల్పించాలని కోరారు. శివారు కాలనీలు నేటికీ అభివృద్ధి చెందలేదన్నారు. శివారు ప్రాంతాల అభివృద్ధికి కేంద్రం నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు జి.రమేష్, తంబి శ్రీనివాసులు, ఎస్డీ హుసేన్, శ్రీరామ శ్రీనివాసులు, శ్యాం, యాసిన్ తదితరులు పాల్గొన్నారు.

ఒంగోలు జాతి ఆవులు మేలిరకం

- పశుసంవర్ధకశాఖ జేడీ డాక్టర్ బేబీరాణి



ఉచిత పశువైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న జేడీ బేబీరాణి

చీమకుర్తి: ఒంగోలు జాతి ఆవులు మేలిరకమైనవని పశుసంవర్ధకశాఖ జేడీ డాక్టర్ కే బేబీరాణి అన్నారు. ఆయా రకం ఆవులకు సంబంధించిన పాలు ఆరోగ్యకరంగా ఉంటాయన్నారు. పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో శనివారం రామతీర్థంలో ఏర్పాటు చేసిన ఉచిత పశువైద్య శిబిరాన్ని జేడీ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా బేబీరాణి మాట్లాడుతూ ఒంగోలు జాతి ఆవులను కాపాడుకోవడానికి రైతులు తమ వంతు సహకారం అందించాలన్నారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి పశుపోషకులు తీసుకొచ్చిన 120 ఆవులకు డాక్టర్లు వైద్యపరీక్షలు చేసి అవసరమైన మందులు అందించారు. కార్యక్రమంలో వెటర్నరీ డాక్టర్లు, స్థానిక సిబ్బంది పాల్గొన్నారు.


ఘనంగా కోటి కుంకుమార్చన



కుంకుమార్చనలో మహిళలు

చీరాల అర్బన్: పట్టణంలోని స్థానిక పాపరాజు తోటలోని కామాక్షి సోమేశ్వర దేవాలయంలో స్వామి వారి 76వ వార్షికోత్సవం సందర్భంగా ఈనెల 1వ తేదీ నుంచి 10వతేదీ వరకు కోటి కుంకుమార్చన నిర్వహిస్తున్నారు. ఈ శనివారం మహిళలచే సామూహికంగా కుంకుమార్చన చేశారు. ప్రతి రోజు 125 మంది మహిళలతో కుంకుమార్చన నిర్వహిస్తున్నారు. దేవస్థాన కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా క్రీడా దినోత్సవం



క్రీడా జ్యోతితో సీఐ భీమానాయక్

మార్కాపురం టౌన్: క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలని సీఐ భీమానాయక్ కోరారు. క్రీడా దినోత్సవాన్ని శనివారం స్థానిక శ్రీ చైతన్య టెక్నో స్కూల్లో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సీఐ మాట్లాడుతూ క్రీడల్లో గెలుపోటములు సమానంగా స్వీకరించాలని సూచించారు. చదువుతో పాటు ఆటలకు కూడా ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. అనంతరం క్రీడా జ్యోతిని వెలిగించారు. వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. ప్రిన్సిపాల్ టి.శ్రీనివాసరావు, డీవీ శ్రీనివాసులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయండి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు



పాల్గొన్న వలంటీర్లు, సచివాలయాల కన్వీనర్లు, గృహ సారధులు

- సచివాలయాల కన్వీనర్లు, గృహ సారధులు, వలంటీర్లకు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు పిలుపు

చీమకుర్తి: రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని గ్రామస్థాయి నుంచి వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేయాలని సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. శనివారం సంతనూతలపాడు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సచివాలయాల కన్వీనర్లు, గృహ సారధులు, వలంటీర్లతో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి అందుతున్నాయో లేదో పరిశీలించి లబ్ధిదారులకు సక్రమంగా అందేలా చూడాలన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకునేందుకు ఇప్పటి నుంచే గ్రామాల్లో పార్టీ పటిష్టతకు కృషి చేయాలన్నారు. మండల స్థాయి జేసీఎస్ కన్వీనర్‌గా నియమించబడిన దుంపా యలమందారెడ్డిని ఈ సందర్భంగా గృహ సారధులు, సచివాలయాల కన్వీనర్లు, వలంటీర్లకు పరిచయం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి, ఎంపీపీ బీ విజయ, జెడ్పీటీసీ సభ్యురాలు దుంపా రమణమ్మ, స్థానిక గ్రామాల నుంచి సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

నగరాన్ని అభివృద్ధి చేస్తాం



సిమెంటు రోడ్డు శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, శిద్దా సుధీర్

- ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి
- రూ.38.30 లక్షలతో నిర్మించిన రోడ్డు, కాలువల ప్రారంభం

ఒంగోలు సబర్బన్: ఒంగోలు నగరంలో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టి పూర్తి చేస్తామని స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ బాలినేని శ్రీనివాసరెడ్డి తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా నగరంలోని 31వ డివిజన్‌లో మోడల్ టౌన్ 11వ అడ్డరోడ్డులో రూ.38.30 లక్షలతో నిర్మించిన సిమెంటు రోడ్డు, కాలువలను శనివారం ఎమ్మెల్యే బాలినేని ప్రారంభించారు. 31వ డివిజన్ కార్పొరేటర్ తన్నీరు నాగజ్యోతి, నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో బాలినేని ముఖ్య అతిథిగా పాల్గొని శిలాఫలకాన్ని ఆవిష్కరించి కొబ్బరికాయలు కొట్టారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు శిద్దా సుధీర్, మేయర్ గంగాడ సుజాత, కమిషనర్ వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కఠారి శంకర్, పలువురు కార్పొరేటర్లు, మున్సిపల్ అధికారులు, సచివాలయ ఉద్యోగులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆదర్శనీయుడు న్యాషా భక్తరాజు

- 39వ వర్ధంతి కార్యక్రమంలో ఎమ్మెల్సీ లక్ష్మణరావు

నాగులుప్పలపాడు: నేటి యువతకు న్యాషా భక్తరాజు ఆదర్శనీయుడని ఎమ్మెల్సీ లక్ష్మణరావు అన్నారు. న్యాషా భక్తరాజు 39వ వర్ధంతి సందర్భంగా ఉప్పుగుండూరులో శనివారం ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్సీ లక్ష్మణరావు పాల్గొని మాట్లాడారు. 3 దశాబ్దాలకుపైగా గ్రామ సర్పంచ్‌గా, సొసైటీ అధ్యక్షునిగా గ్రామానికి న్యాషా భక్తరాజు సేవ చేయడంతో పాటు సాంఘిక దురాచారాలను పారదోలడానికి అప్పట్లోనే ఎస్సీలకు స్వయంగా బావులు నిర్మించారన్నారు. ఆ బావులు నేడు గ్రామం మొత్తానికి ఆధారం కావడం చాలా సంతోషమన్నారు. ఆయన భావాలను నేటి యువత అలవరుచుకుని సామాజిక న్యాయం, సేవ వంటి రంగాల్లో ముందుండాలని తెలిపారు. ఈ సందర్భంగా భక్తయ్య విజ్ఞాన కేంద్రం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రజానాట్యమండలి వారి కోలాటం ఆకట్టుకుంది.



విజ్ఞాన కేంద్రానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన...

న్యాషా భక్తరాజు వర్ధంతి సందర్భంగా ఒంగోలు కిమ్స్ ఆస్పత్రి సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరంలో కంటి, కిడ్నీ, గుండె సంబంధిత వ్యాధులకు పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. శిబిరాన్ని గ్రామ సర్పంచ్ దేవరకొండ జయమ్మ ప్రారంభించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు మాబు, జయంత్ బాబు, తూబాటి శ్రీకాంత్, వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు మాదాసు రాంబాబు, కొంజేటి సురేష్, ఎంపీటీసీ మున్నంగి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా మండల స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న జిల్లా ఉప విద్యాశాఖాధికారి అనితా రోజ్‌రాణి

ఒంగోలు టౌన్: మండలస్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన స్థానిక పీవీఆర్ బాయ్స్ హైస్కూల్‌లో శనివారం ఉత్సాహంగా జరిగింది. హెచ్‌ఎం మువ్వా రాధిక అధ్యక్షతన నిర్వహించిన ప్రదర్శనలో డిప్యూటీ డీఈవో అనితా రోజ్‌రాణి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మండల విద్యాశాఖాధికారి కిషోర్ పర్యవేక్షించారు. వివిధ అంశాలపై 80కిపైగా ప్రదర్శనలు చేశారు. జిల్లా సైన్స్ అధికారి రమేష్, ఉపాధ్యాయులు ఎస్.వెంకటేశ్వర్లు, పీవీ నారాయణ తదితరులు పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు.

భారతీయ సినిమా పాట బోసిపోయింది



ఒంగోలులో వాణీ జయరాంకు జాతీయ పురస్కారాన్ని అందజేస్తున్న దృశ్యం (ఫైల్ ఫొటో)

ఒంగోలు టౌన్: వేలాది పాటలతో కోట్లాది మంది శ్రోతలను ఉర్రూతలూగించి శాస్త్రీయ సంగీతానికి గౌరవాన్ని పెంపొందించిన ప్రముఖ గాయని వాణీ జయరాం మృతి భారతీయ సినీరంగానికి తీరని లోటని ఘంటశాల నేషనల్ ఆర్ట్స్ అకాడమీ అధ్యక్షుడు టి.విజయ్‌కాంత్, ప్రకాశం జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు పొన్నూరు వెంకట శ్రీనివాసులు అన్నారు. శనివారం ఒక ప్రకటనలో వాణీజయరాం మృతికి సంతాపం వ్యక్తం చేశారు. 2016లో ఘంటశాల అకాడమీ 30వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని వాణీజయరాంను ఘంటశాల జాతీయ పురస్కారంతో ఒంగోలులోని ఏవీఎస్ ఫంక్షన్ హాలులో ఘనంగా సన్మానించినట్లు గుర్తుచేసుకున్నారు. 18 భాషల్లో 10 వేలకుపైగా పాటలు పాడిన ఆమె.. భారత ప్రభుత్వం ప్రకటించిన అత్యున్నత పురస్కారం పద్మభూషణ్ అవార్డుకు ఎంపికై అవార్డు అందుకోక మునుపే అకస్మాత్తుగా మరణించడం బాధాకరమన్నారు. వాణీ జయరాం అందుకున్న మూడు జాతీయ అవార్డులలో రెండు తెలుగు సినిమాలు కావడం తెలుగు వారిక గర్వకారణమని కొనియాడారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం

వేటపాలెం: ప్రస్తుత ఆధునిక టెక్నాలజీలో సైబర్ నేరాలపై మహిళలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని జేఎన్‌టీయూ యూనివర్శిటీ సీఎస్‌ఈ విభాగాధిపతి ఎఎస్ఎన్ చక్రవర్తి పేర్కొన్నారు. స్థానిక సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో సైబర్ నేరాలపై వెబినార్ శనివారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అధునిక డిజిటల్ ప్రపంచంలో మహిళలు ఆన్‌లైన్, సోషల్ మీడియాను ఎక్కువ వినియోగిస్తున్నారని తెలిపారు. దీని ద్వారా సమాచారాన్ని వేగవంతంగా చేరవేయడమే కాకుండా విద్యార్థినులు అకర్షణ పెంచుకుంటున్నారన్నారు. ఇటువంటి పరిస్థితుల్లోనే సైబర్ నేరగాళ్ల బారినపడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో మహిళల భద్రత కోసం తీసుకోవాల్సిన ముందు జాగ్రత్త చర్యల గురించి వివరించారు. అవసరం ఉన్నప్పుడు మాత్రమే మీ మొబైల్ ఇంటర్‌నెట్ ఆన్ చేసుకోవాలని సూచించారు. ప్రిన్సిపాల్ మొయిద వేణుగోపాలరావు మాట్లాడుతూ అధునిక మహిళలు సరైన అవగాహన లేక ఈ–మెయిల్ స్పూఫింగ్, హ్యాకింగ్, సైబర్ పోర్నోగ్రఫీ, సైబర్ ఫిల్టరింగ్ బారిన పడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఐసీసీ సెల్ ఇన్‌చార్జి ఆర్ఎన్‌డీ ధనలక్ష్మి పాల్గొన్నారు.



పాల్గొన్న విద్యార్థినులు

కేజీబీవీని సందర్శించిన ప్రజాప్రతినిధులు

దొనకొండ: స్థానిక కస్తూరిబా గురుకుల పాఠశాలలో సుమారు 16 మంది అస్వస్థతకు గురై శుక్రవారం మార్కాపురం ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఎంపీపీ బొరిగొర్ల ఉషామురళి, సర్పంచ్ కొంగలేటి గ్రేస్‌కుమారి దేవానంద్, ఎంపీడీఓ వి.వసంతరావునాయక్, ఎంఈఓ ఎస్.సాంబశివరావు శనివారం పాఠశాలను సందర్శించారు. విద్యార్థులు అస్వస్థతకు గురైన కారణాలు, లోపాలు ప్రత్యేకాధికారి అరుణను అడిగి తెలుసుకున్నారు. బాలికల విషయంలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

ఫుడ్ ఇన్‌స్పెక్టర్ తనిఖీ

కేజీబీవీ పాఠశాలలో విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారని విషయం తెలుసుకుని ఫుడ్ ఇన్‌స్పెక్టర్ బి.నరసింహులు శనివారం తనిఖీ చేశారు. బాలికలు మార్కాపురం వైద్యశాలలో చికిత్స పొందుతున్నారని తెలుసుకుని అక్కడికి వెళ్లి వైద్యాధికారితో మాట్లాడారు. బాలికలు ఫుడ్ పాయిజన్‌తో అస్వస్థతకు గురయ్యారని వైద్యాధికారులు తెలిపారన్నారు. బాలికలకు పాలల్లో ఎక్కువ మిరియాలు కలపడంతో అస్వస్థతకు కారణమన్నారు. 30 రకాల సరుకులు గుంటూరు ల్యాబ్‌కు పంపిస్తామన్నారు. నివేదికను డైరెక్టర్ పూర్ణచంద్రరావుకు, ఫుడ్ సేఫ్టీ కమిషనర్ జె.నివాస్‌కు, జిల్లా జాయింట్ కలెక్టర్ అభిషిక్త్ కిశోర్‌కు అందజేస్తామన్నారు. ల్యాబ్‌లోని రిపోర్ట్ ఆధారంగా ఫుడ్ పాయిజన్‌తో ఇన్‌ఫెక్షన్ జరిగినట్లు రుజువైతే చర్యలు తీసుకుంటామని నరసింహారావు హెచ్చరించారు.



వివరాలు నమోదు చేస్తున్న ఫుడ్ ఇన్‌స్పెక్టర్

లక్ష్మీతిరుపతమ్మ కల్యాణం నేడు

కురిచేడు: శ్రీ గోపయ్య సమేత శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ ఆరాధన ఉత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించనున్నారు. స్థానిక పాత పోలీసుస్టేషన్ వద్ద, కోన వల్లభరాయస్వామి కొండపై, మండలంలోని పేరంబొట్లపాలెంలో అమ్మవారి ఉత్సవాలు నిర్వహిస్తారు. స్వామి వార్లకు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకుంటారు. అనంతరం కల్యాణం నిర్వహిస్తారు. భక్తులు పాల్గొని తమ మొక్కులు తీర్చుకుంటారు.

టీ కొట్టుకు నిప్పు

బల్లికురవ: టీ దుకాణం ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తుండగా దుండగులు రాత్రికి రాత్రే తన టీ దుకాణానికి నిప్పు పెట్టారని బాధితుడు కోడెల సతీష్ శనివారం వాపోయారు. మండలంలోని ఉప్పుమాగులూరు గ్రామానికి చెందిన సతీష్ వేమవరం జంక్షన్‌లో టీదుకాణం ఏర్పాటు చేసుకున్నాడు. శనివారం ఉదయం దుకాణానికి వేసిన పాక, దుకాణంలోని కొంత సామగ్రి కాలి బూడిదై ఉన్నాయని, పథకం ప్రకారమే తన దుకాణానికి నిప్పంటించారని బాధితుడు వివరించారు. సుమారు రూ.40 వేలు పైచిలుకు నష్టం వాటిల్లిందని వాపోయాడు.



కాలిపోయిన టీ దుకాణం

ఉపాధి హామీ కూలీలకు కిట్ల పంపిణీ

మద్దిపాడు: మండలంలోని అన్ని సచివాలయాల పరిధిలో పనిచేస్తున్న ఉపాధి హామీ కూలీలకు ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి శనివారం తన కార్యాలయంలో మందుల కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఉపాధి కూలీలకు మందుల కిట్లు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. పని చేసే సమయంలో కూలీలు గాయాలబారిన పడతారని, అటువంటి పరిస్థితులలో ఈ కిట్లు ఉపయోగపడతాయని అన్నారు. అన్ని విధాలుగా ఉపాధి కూలీల బాగోగులు చూస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అభినందనలు తెలిపారు. వచ్చే వేసవిలో ఉపాధి కూలీలకు మజ్జిగ అందించేందుకు ప్రయత్నించాలని ఏపీవో వాక్యవతిని ఆదేశించారు. కార్యక్రమంలో ఇనమనమెళ్లూరు గ్రామ సర్పంచ్ ఏకుల ఏడుకొండలు, జేసీఎస్ మండల కన్వీనర్ బత్తుల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



ఉపాధి కూలీలకు కిట్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి

గుంటూరు వెళ్లి పింఛన్ ఇచ్చిన వలంటీర్

మార్కాపురం: మండలంలోని కొండేపల్లికి చెందిన మండ్ల కాశయ్య అనారోగ్యంతో గుంటూరులోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా గ్రామానికి చెందిన వలంటీర్ పరిసినేని అంజి శనివారం గుంటూరు వైద్యశాలకు పింఛన్ అందించారు. గ్రామస్తులు అంజిని అభినందించారు.



పింఛన్ అందిస్తున్న వలంటీర్ అంజి

వైభవంగా చెన్నకేశవునికి శాంతి కల్యాణం

మార్కాపురం టౌన్: శ్రీదేవి, భూదేవి సమేత శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి వారి శాంతి కల్యాణం అర్చకులు శనివారం వైభవంగా జరిపించారు. ఉదయం స్వామి వారి మూలవిరాట్‌కు అర్చకులు, అర్చక బృందం ఆధ్వర్యంలో అభిషేకాలు, విష్ణు సహస్రనామ పారాయణం, అర్చన, అష్టోత్తర పూజలు నిర్వహించారు. 11 గంటలకు ఆలయ మధ్య రంగ మండపంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై ప్రత్యేక పూల అలకరణలో ఉభయ దేవేరులతో చెన్నకేశవ స్వామి వారి ఉత్సవ విగ్రహాలను ప్రతిష్టించారు. వేద మంత్రాల మధ్య చెన్నకేశవ స్వామి వారి కల్యాణాన్ని వైభవంగా జరిపించారు. చెన్నకేశవుని శాంతి కల్యాణానికి ఉభయదాతలు హాజరయ్యారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ ఈవో జి.శ్రీనివాసరెడ్డి, చైర్మన్ పి.కేశవరావు, ధర్మకర్తలు, గౌరవాధ్యక్షుడు రామడుగు కోటేశ్వరరావు, కోశాధికారి పెరుమాళ్ల కోటేశ్వరరావు, కార్యదర్శి రామడుగు వెంకట సుబ్బారావు పాల్గొన్నారు.





ప్రమాదాల నివారణకు చర్యలు

ముండ్లమూరు: రోడ్డు ప్రమాదాల నివారణకు కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నట్లు దర్శి డీఎస్పీ నారాయణస్వామిరెడ్డి స్పష్టం చేశారు. శనివారం మండలంలోని అద్దంకి– దర్శి ప్రధాన రహదారిలో నో యాక్సిడెంట్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వేంపాడు వద్ద వాహనదారులకు పలు సూచనలు, సలహాలు చేశారు. వాహనదారులు తప్పని సరిగా హెల్మెట్ ధరిస్తే ప్రాణాపాయం నుంచి తప్పించుకోవచ్చన్నారు. హెల్మెట్ ప్రాధాన్యతను ప్రతి వాహనదారుడు గుర్తించాలన్నారు. కూలీల ఆటో డ్రైవర్లు అప్రమత్తంగా ఉంటూ వాహనాలు నడపాలన్నారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుంటే ఇబ్బందులు తప్పవని డీఎస్పీ హెచ్చరించారు. ఆయన వెంట ఎస్ఐ ఎల్. సంపత్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.

బేస్తవారిపేట: వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ రూల్స్ పాటించాలని ఎస్ఐ మాధవరావు కోరారు. శనివారం మండలంలోని పందిళ్లపల్లె టోల్‌ప్లాజా, బేస్తవారిపేట బస్టాండ్ ఆవరణలో వాహనదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హెల్మెట్ ధరిస్తే ప్రాణాలకు రక్షణ ఉంటుందన్నారు. రోడ్డు ప్రమాదాల్లో 90 శాతం మరణాలు తలకు గాయాలు కావడంతోనే జరుగుతున్నాయన్నారు.



ప్రయాణికులకు సూచనలిస్తున్న డీఎస్పీ నారాయణస్వామిరెడ్డి

నాయకుని మృతదేహానికి ఎమ్మెల్యే టీజేఆర్ నివాళి

చీమకుర్తి: మండలంలోని దేవరపాలెం గ్రామంలోని వైఎస్సార్ సీపీ నాయకుడు మందా యలమంద అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన మృతదేహానికి ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు శనివారం ఘనంగా నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో జెడ్పీటీసీ సభ్యుడు వేమా శ్రీనివాసరావు, కౌన్సిలర్ పాటిబండ్ల గంగయ్య, ఎమ్మార్పీఎస్ నాయకుడు ఉసురుపాటి బ్రహ్మయ్య, స్థానిక నాయకులు ఉన్నారు.



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు

వ్యవసాయ సలహా మండలి చైర్మన్‌గా దశరథ్

చీమకుర్తి: వ్యవసాయ సలహా మండలి సంతనూతలపాడు నియోజకవర్గ చైర్మన్‌గా యర్రా దశరథ్‌ను ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు నియమించారు. నాగులుప్పలపాడు మండలం చేకూరపాడు గ్రామానికి చెందిన యర్రా దశరథ.. పార్టీ ఆవిర్భావం నుంచి క్రియాశీలకంగా పనిచేస్తున్నారని, ఆయన సేవలను గుర్తించి పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్ బాలినేని శ్రీనివాసరెడ్డి సూచనల మేరకు చైర్మన్ నియమించినట్లు ఎమ్మెల్యే ఒక ప్రకటనలో తెలిపారు.

